

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : **సద్గురు శ్రీ నాన్నగారు**



సంపుటి : 10 సంచిక : 15 పుష్పం : 31-32 20-04-2005

**రమణ భాస్కర**

**ఆధ్యాత్మిక పక్ష పత్రిక**

**పేజీలు : 16**

గౌరవ సంపాదకులు

శ్రీమతి **P.H.V. సత్యవతి (హైమ)**

**చందా**

సంవత్సర చందా:రు॥100/-

విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


02-01-05

కైకలూరు .................. 1

09-02-05

మురమళ్ళ.................. 9



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, ☎ 08814 - 228858


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-01-05, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

గాఢనిద్రలో మనకు దేహాభిమానం ఉండదు. అలాగే జాగ్రదవస్థలో దేహాభిమానం లేకుండా మనం ఉండగలగాలి. ఎందుచేతనంటే దేహాభిమానం ఉన్నంతకాలం దేహాలు వస్తూనే ఉంటాయి, దానిని ఎవరూ నివారించలేరు. దేహాభిమానం నశించటానికి యజ్ఞభావనతో పనిచేయమని భగవంతుడు చెపుతున్నాడు. యజ్ఞభావనతో పని చేయటం వలన మనం పవిత్రులం అవుతాము, ఏకాగ్రత వస్తుంది, దేహబుద్ధి నశిస్తుంది. ద్రవ్యయజ్ఞం, తపోయజ్ఞం, జపయజ్ఞం, జ్ఞాన యజ్ఞం ఇవి అన్నీ యజ్ఞాలు. అధ్యయనం చేయటంలోగాని, ప్రవచనం చేయటంలోగాని అశ్రద్ధ పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు. నువ్వు జాగ్రత్తగా అధ్యయనం చేయాలి, దానిని అర్థం చేసుకోవాలి, నువ్వు చెప్పగలిగితే ఇతరులకు నీ అనుభవాలను పంచగలగాలి. అది కూడా యజ్ఞం. కాలం స్పీడుగా వెళ్ళిపోతూ ఉంటుంది, కాలాన్ని మనం ఆపలేము, కాల ప్రవాహంలో మన శరీరం కూడా కొట్టుకొనిపోతుంది. అందుచేత ఈ శరీరం ఉండగానే మనం జాగ్రత్తపడాలి, శరీరం పోయినతరువాత మనం చేసేది ఏమీలేదు. ఈ దేహం భూమిమీద తిరుగాడుతున్నప్పడే మనో దేహములను సద్వినియోగం చేసుకొని తత్వాన్ని తెలుసుకోమని, తత్వ జ్ఞానంలో ఆనందాన్ని అనుభవించమని పెద్దలు చెపుతున్నారు. నిన్ను నీవు తెలుసుకోకుండా ఏదో ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి? మిగిలిన విషయాల గురించి తొందరపడకు, చేద్దువుగాని ముందు నిన్ను నీవు తెలుసుకో. నిన్ను నీవు తెలుసుకోకుండా ప్రపంచం గురించి తెలుసుకొంటే అది ఒకటిలేని సున్నలతో సమానము, ఇది అర్థం చేసుకోండి.

నువ్వు ఎవడివో నీకు తెలియదు, ఈ భూమి మీదకు ఎందుకు వచ్చావో తెలియదు, ప్రపంచం గురించి తెలుసుకొంటాను, ప్రపంచాన్ని ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి? మనం ఎవరిమో మనం తెలుసుకొనేవరకు మనకు స్వేచ్ఛలేదు, స్వాతంత్ర్యం లేదు. తత్వం తెలిసేవరకు మనకు శాంతి లేదు, సుఖం లేదు, ఆనందం లేదు. అప్పటివరకు మనస్సు ఎటుగంతులు వెయ్యమంటే అటు గంతులు వేస్తాము. అహంకారం ఉన్నవాడికి స్థిరత్వం ఉండదు. పాపం, పుణ్యం, ఈ బాధలు, సంతోషాలు ఇవి అన్నీ అహంకారానికే. అది లేనివాడికి ఏదీ లేదు. ఎందుచేతనంటే అహంకారం నశించిన వెంటనే నారాయణుడే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. దుమ్ము దులుపుకొన్నట్లు ఈ ప్రకృతిని దులిపేసుకో, జీవలక్షణాలను వదిలించుకో. అహంకారాన్ని నేను కల్పించలేదు, అది నువ్వే కల్పించుకొన్నావు అందుచేత ప్రయత్నం చేసి దానిని వదిలించుకో. నీవు ప్రయత్నం చేస్తూఉంటే నా సహకారం నీకు అందుతుంది.

మీరు పూజ చేయాలంటే, హోమాలు చేయాలంటే ఖర్చు అవుతుంది, ఒక్క పైసా కూడా ఖర్చు లేనిది జపయజ్ఞం. మీరు హాయిగా కూర్చుని మీకు ఇష్టమైన భగవంతుని నామాన్ని జపించుకోండి, అది శ్రద్ధగా చేయండి, ప్రేమగా చేయండి. మీరు పవిత్రులవుతారు. మన మనస్సు విజృంభిస్తూ ఉంటుంది. మనస్సు యొక్క విజృంభణను ఆపుచేసి, మనస్సును ఎండగట్టటమే తపస్సు. మనం ఏదో చూస్తూ ఉంటాము, ఏదో విషయాలను ఆలోచిస్తూ ఉంటాము, అది మనకు కావాలి అనిపిస్తుంది. వాటిని చూసేది, వాటి గురించి ఆలోచించేది, నాకు కావాలి అని చెప్పేది మనస్సే. వాటికోసం ప్రయత్నం చేసేది, వాటిని అనుభవించేది మనస్సే. మనస్సును తీసివేస్తే ఏమీ లేదు. దరిద్రం బయట ఏమీలేదు దరిద్రం అంతా మనస్సులోనే ఉంది, ఇది మీరు అర్థం చేసుకోండి. మన లోపల ఉన్నదే బయట కనిపిస్తోంది కాని లోపల లేనిది బయట కనబడదు. మనస్సు నశిస్తే మనం మిగులుతాము అంటే మనం ఏదిగా ఉన్నామో అది మనకు ఎరుకలోనికి వస్తుంది, అది తత్వజ్ఞానం. బయట విషయాలనుండి మనం సంతోషం అనుభవిస్తూ ఉంటే అది అంతా ఏదో రోజున దుఃఖంగా మారిపోతుంది. రూపబుద్ధి, నామబుద్ధి తప్పనిసరిగా మనకు దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. నీకు అహంభావన ఉంది. నీవు చేసే చెడ్డకు ఫలితం రాకూడదు అంటే ఎలా కుదురుతుంది, తప్పనిసరిగా వచ్చి తీరుతుంది. జపాలు చేసేవారు అందరూ మేం జపం చేస్తున్నాము, మేం జపం చేస్తున్నాము అంటున్నారు కదా. మరి నేను చేస్తున్నాను అనుకొన్నప్పడు పుణ్యం వస్తుంది. నేను చేస్తున్నాను అనే బుద్ధి లేకపోతే పుణ్యం లేదు. నేను చేస్తున్నాను అనే కర్తృత్వబుద్ధి ఉన్నప్పడు పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం అనుభవించాలి. నువ్వు ఏదైనా ఇచ్చేటప్పడు ఇవ్వటం కోసమే ఇవ్వాలి, ప్రేమతో ఇవ్వాలి అంతేగాని అక్కడ ఏదో ప్రయోజనం ఆశించి

ఇస్తే మటుకు అది దానం కాదు, ఒకవేళ అది నువ్వు దానం అనుకొన్నా అది రాక్షసదానం. నీకు ఇవ్వాలని ఉందా ఇచ్చి మర్చిపో అంతేగాని లోపల ఏదో ప్రయోజనం పెట్టుకొని నువ్వు మంచిపని చేసినా అది దానం కింద రాదు. యజ్ఞదానతపస్సుల వలన నీవు పవిత్రుడవు అవుతావు, మనస్సు నియమింపబడుతుంది, అది హృదయాకారం చెందుతుంది. యజ్ఞ దాన తపస్సులను నీవు ప్రాణంపోయే వరకు విడిచిపెట్టవద్దు అని పరమాత్మ చెప్పాడు, అంటే మనోనాశనం అయ్యేవరకు వాటిని విడిచిపెట్టకూడదు. మనం ఏదైనా మంచి చేయాలి అనుకొన్నప్పడు చేసి వదిలివేయటమే, ఫలితం కోసం ఎదురు చూడవద్దు, అది భగవంతుడు నిర్ణయిస్తాడు. ఎవడికైతే కర్తృత్వబుద్ధి ఉందో వాడుజన్మ రాహిత్యాన్ని పొందలేడు. ఏదో యోగం ద్వారా మనస్సును తీసుకొనివెళ్ళి హృదయంలో ప్రవేశపెట్టాలి. హృదయంలో ఉంటేనేగాని మనస్సు నశించదు. జాగ్రదవస్థలో సర్వసాధారణంగా మనస్సు ఎక్కువసేపు శిరస్సులో ఉంటుంది, దానిని తీసుకొని వెళ్ళి హృదయంలో నిలబెట్టటం అలవాటు చేయాలి.

మనం కోరిక లేకుండా, స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే పూర్వపు వాసనలు తగ్గుతాయి, కొత్త వాసనలు రావు. మనం ఏ పని చేసినా కోరికతో చేస్తాము, కోరికతో పనిచేసామంటే వాసన పడితీరుతుంది, ఆ వాసన మరల మనచేత పని చేయిస్తుంది, ఇదే కర్మచక్రం. ఎవడో మహాత్ముడు, మహాగురువు, జ్ఞాని, అవతారపురుషుడు యొక్క దయలేకుండా ఈ కర్మచక్రంలో నుండి మనం బయటపడే అవకాశం లేదు. ఎండ్రిన్ కొంచెం ఎక్కువ తాగితే శరీరం చనిపోతుంది. చాలా కొంచెం పుచ్చుకొన్నాము అనుకోండి అది శరీరాన్ని చంపకపోయినా, శరీరానికి ఎంతో కొంత చెడ్డ చేస్తుంది. అలాగే మనకు పెద్ద పెద్ద చెడుతలంపులు రాకపోయినా, ఆ చెడుతలంపులు చిన్నవి అయినా కూడా అవి మనస్సులోనికి వెళ్ళి మనస్సును పాడుచేస్తాయి. నీకు మహర్షులతోటి, మహాత్ములతోటి, జ్ఞానులతోటి సహవాసం మంచిది. ఎందుచేతనంటే వారి సమక్షంలో మనస్సుకు హృదయాభిముఖంగా ప్రయాణం చేయటం అలవాటు అవుతుంది. జ్ఞాని చేసేపని మౌనంగానే చేస్తాడు, ఏదైనా అవసరమయితే మాట్లాడతాడు. మనం అవసరం లేకపోయినా మాట్లాడతాము, అహంభావన కోసం మాట్లాడతాము. దీనివలన వ్యక్తిభావన పెరుగుతుంది, దేహాభిమానం పెరుగుతుంది, చివరకు ఇదంతా మనకు దుఃఖానికి కారణం అవుతుంది. ఎవడికైతే జ్ఞాన సిద్ధి కలిగిందో, ఎవడైతే ఆత్మస్థితిని పొందాడో వాడి ద్వారా మౌనంగానే పని జరిగిపోతుంది. అక్కడ మాటలతో పనిలేదు, అక్కడ నీ ప్రయత్నంతో సంబంధం లేకుండానే మనస్సు యొక్క చాపల్యం ఆగిపోవటం ప్రారంభిస్తుంది, అది జ్ఞాని యొక్క ఔన్నత్యం. మనం ఏమి చేస్తాము అంటే ఏదయినా ఒక పని ఇష్టంతో చేస్తాము, అది మనకు ఎప్పటికయినా అపకారం చేస్తుంది

అని మనకు తెలియదు. ఏదో ఉపకారం అని చేస్తాము చివరకు వచ్చేటప్పటికి అది అపకారం అవుతుంది. ఆ వాసనను తొలగించుకోవటానికి మరల ప్రయత్నం చేస్తాము. కాళ్ళు బాడి చేసుకోవటం కడుక్కోవటం ఇదే పని మనకు, ఇలా కాలాన్ని వృధాచేసుకోవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. నన్ను ప్రమాణంగా తీసుకో. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అని ఆలోచించుకొంటూ కూర్చొంటే పుణ్యకాలం కాస్తా అయిపోతుంది. జీవుడికి ఏది మంచిదో, ఏది చెడ్డదో అనేది ఋషులు అనుభవించి మనకు చెప్పారు. వాటిని ప్రమాణంగా తీసుకో. నీ శరీరయాత్రకు సరిపడ పని చేసుకొంటూ మిగతాకాలం అంతా నువ్వు ఏదైతే అయిఉన్నావో దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేసుకో. దానిని తెలుసుకోలేదు అనుకో నువ్వు జీవితంలో చాలా నష్టపోతావు, మరణించిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి.

నీ మనస్సును ప్రమాణంగా పెట్టుకోవద్దు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో. నీ గురువుతోటి, భగవంతుడితోటి, భగవంతుడు చెప్పిన వాక్యంతోటి మానసికఅనుబంధం పెట్టుకో. మిమ్మల్ని అహంకారం పెట్టుకోమని, గర్వం తెచ్చుకోమని నేను చెప్పలేదు, ప్రకృతిని చూసి నేర్చుకొంటున్నారు. అసలు మనకు ఉన్న చదువు ఎంత? తెలివి ఎంత? మొన్న సునామీ అని వచ్చింది, వేలాదిమంది చనిపోయారు. సైన్సు పెరిగిపోయింది అంటున్నారు, దానిని ఆపుచేయటం మాట వదలండి, అసలు అది వస్తోందని కూడా అర్థం కాలేదు. సునామీ వచ్చింది సముద్రం ఒడ్డున ఉన్నవారు పోయారు, మనకు ఏమీ పరవాలేదు అనుకోవద్దు. పంచభూతాలు విజృంభించకుండా ఉంటేనే మనం ఏదో అలా కొద్దికాలం ఉంటాము, అవి విజృంభిస్తే ప్రళయం వస్తే మొత్తం అంతా ముంచేస్తుంది. వేదకాలంనాటి ఋషులు ప్రకృతిని శోధించి, మానవ స్వభావాన్ని శోధించి చెప్పిన విషయాల సారాన్ని నేను గీతలో చెప్పాను, అది ప్రమాణంగా తీసుకొని జీవిస్తే బాగుపడతావు అని చెపుతూ నీకు ఎలా బాగుంటే అలా చెయ్యమని భగవంతుడు చెప్పాడు కాని బలవంతం చెయ్యలేదు. మీరు ఏదైనా మంచిస్థితిలో ఉన్నారు అనుకోండి, మీకు ఇష్టులైనవారిని కూడా ఆస్థితికి తీసుకొని రావటానికి ప్రయత్నం చేస్తారు. ఒక మామూలు మనిషికే అంత ప్రేమ ఉన్నప్పుడు ఇంక మనం భగవంతుడిని విశ్వసిస్తే ఆయనకు మన పట్ల ఎంత ప్రేమ ఉంటుందో మరి.

రామకృష్ణుడు శరీరం విడిచిపెట్టేముందు వివేకానందుడు అంటాడు నువ్వు అవతార పురుషుడవని చెప్పకొంటున్నాము, రామకృష్ణుడు సద్గురువు అని చెప్పకొంటున్నాము. ఇప్పడు మీరు కేన్సర్‌తో బాధపడుతున్నారు కదా. ఇప్పడు కూడా ఇంత శరీరబాధలో కూడా మీకు భగవదనుభవం ఉందా లేక కిందకు జారిపోతున్నారా అని అడిగితే నరేన్, ఇలా ఎంతకాలం

సందేహిస్తూ ఉంటావు. ఏ రోజుకారోజు సందేహమేనా? ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు, కాని అద్వైతపరంగా కాదు, అద్వైతపరంగా చూస్తే ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అని రామకృష్ణుడు చెపుతూ నాకున్నదంతా నీకు ఇచ్చేసి నరేన్ నేను పేదవాడిని అయిపోయాను అని చెప్పారు. గురువు అంటే శరీరం కాదు, గురువు అంటే ఆత్మ. తరువాత కూడా వివేకానందుడు కొన్ని మహిమలకు ఆకర్షింపబడ్డాడు, గురువు అతనికి లోపల దర్శన మిచ్చి మాయలో పడకుండా ప్రోపర్‌గా గైడ్‌చేసుకొంటూ వెళ్ళాడు. ఒకసారి స్వామీజీ ఆయన అనుభవం చెప్పారు. ఆయనకు అమెరికాలో చాలా పేరు వచ్చింది. నీ గురువు ఏమిటి, ఆయనకు చదువు సంధ్యా లేదు ఆయన వలన నీకు గౌరవం రావటం ఏమిటి, నీవలననే ఆయనకు గౌరవం, వైభవం వస్తోంది అని కొంతమంది అంటే నిజమేనేమో అని కొంచెం స్వామీజీకి అనిపించిందట. గురువు అంటే అంతర్యామి, లోపలే ఉన్నాడు కదా, ఈ తలంపు చూసాడు, వీడికి విషం పట్టుకొంటోంది, దానిని తొలగించాలి, ఆ వ్యక్తిభావనను పోగొట్టాలి, ఆ చెడుతలంపును మొదటలోనే తుంచేయాలి అనుకొన్నాడు. మరుసటిరోజు ఒక అమ్మగారు స్వామీజీకి భోజనం చెప్పారు. ఆ రాత్రి రామకృష్ణుడు ఆమెకు స్వప్నంలో కనిపించాడు. ఆ అమ్మగారు ఆర్టిస్టు, రామకృష్ణుడు ఎలా ఉంటాడో అలాగ గోడమీద ఆయన బొమ్మ వేసేసింది. స్వామీజీ భోజనానికి వచ్చినప్పడు ఆ బొమ్మను చూసి ఆశ్చర్యపోయాడు. ఆయన ఎవరు అని ఆ అమ్మగారిని అడిగాడు. ఆయన ఎవరో నాకు తెలియదు, రాత్రి స్వప్నంలోనికి వచ్చాడు, ఆ బొమ్మనాకు వేయాలనిపించింది, వేసాను అని చెప్పింది. అప్పడు వివేకానందుడు అనుకొన్నాడు నాకంటే నా గురువు ముందు వచ్చేసాడు అని లెంపలు వేసుకొన్నాడు అంటే గురువు నన్ను నడుపుతున్నాడు, నాకేదయినా గౌరవం వస్తే దానికి కూడా గురువే కారణం అని అప్పడు గుర్తించాను అని స్వామీజీ చెప్పారు. అంటే ఆయనకు ఈ పాడుబుద్ధి రాలేదు, వారు వీరు చెపుతూ ఉంటే ఆ పిచ్చి మాటలు పట్టుకొని సడన్‌గా ఆయనకు గర్వం వచ్చేసింది. దానిని తొలగించటానికి గురువు ఆవిధంగా చేసాడు. గురువుతో ఎప్పడూ అద్వైతం పనికి రాదు. మనకు నిజంగా గురుభక్తి కుదిరింది అనుకోండి, అందరిలోనూ మనకు గురువే కనిపించాలి, అది గురుభక్తి అంటే. గురువు అంటే శరీరం కాదు. గురువుతో ఉన్న అనుబంధం ఆ శరీరం పోయిన తరువాత కూడా కంటిన్యూ అవుతుంది. గురువుతో మానసిక అనుబంధం చాలా ముఖ్యం. భగవాన్ నాలుగు రోజులకు శరీరం విడిచిపెడతారు అనగా ఎవరో అన్నారు ఈ శరీరం పోతోంది ఇంక మీకు మాకు సంబంధం తెగిపోతుంది కదా అంటే భగవాన్ ఏమి చెప్పారు అంటు పూర్వజన్మలలో ఏ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసు కొన్నామా, ఈ సంబంధం మనలను మరొకచోట కలపదా అన్నారు. అంటే మనకు ఆత్మజ్ఞానం

కలిగే వరకు గురువు మనలను విడిచిపెట్టడు, వాడు గురువు. ఏసుక్రీస్తు శరీరాన్ని ఏవిధంగా అయితే శిలువ వేసారో అలాగ మీ అహంకారాన్ని శిలువ వేస్తే మీకు అమృతానుభవం కలుగుతుంది, ఇప్పుడే ఇక్కడే ఈ శరీరం ఉండగానే మోక్షసుఖాన్ని పొందుతారు. గాఢ నిద్రలో మనకు దేహాభిమానం లేదు, అలాగ దేహాభిమానం లేకుండా జాగ్రదవస్థలో ఉండగలిగితే వ్యక్తిభావన నశిస్తుంది. అలాగ ఉండాలని అనుకోవటం కాదు, అలాగ మీరు ఉండగలగాలి. చనిపోయిన తరువాత చాలా లోకాలు ఉన్నాయి అని చెపుతున్నారు అది నిజమా అని భగవాన్‌ను అడిగితే చూచినవారు చెపుతున్నారు కాబట్టి మనం నమ్మాలి అయితే ఈ మనస్సు ఎంత నిజమో ఆ లోకాలు కూడా అంతే నిజం. మనస్సు నశిస్తే ఏమీ లేదు అని భగవాన్ చెప్పారు. భవిష్యత్‌లో గాలిమేడలు కట్టవద్దు . జరిగిపోయిన విషయాలు అస్తమాను తలపెట్టుకోవద్దు. వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొంటూ ఈ మనస్సును ధ్వంసం చేయటానికి ప్రయత్నం చేసుకో, అదే సాధన. శరీరం చనిపోవటానికి సాధన ఎవరూ చేయనక్కరలేదు. ఏదో రోజున శరీరం చనిపోతుంది. దేహంతో తాదాత్మ్యం పొందే తలంపును ధ్వంసం చేయటం మీదే నీ సాధనను గురిపెట్టు.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయటం మానివేసి, ఏది సత్యమో, ఏది నిత్యమో, ఏది సర్వకాల సర్వావస్థలలో ఎప్పుడూ మనకూడా ఉంటుందో అటువంటి ఆనందాన్ని పొందటం కోసం ప్రయత్నం చేయటం మానివేసి అది సాధించాలి, ఇది సాధించాలి అని కాలక్షేపం చేస్తున్నారు. ఓ పిచ్చివాడా! నువ్వు వచ్చినపని మర్చిపోవద్దు. నీ దేహప్రారబ్దంలో ఏది ఉంటే అది జరుగుతుంది, ఆ పని చేసే యోగం నీకు లేకపోతే నీ ద్వారా ఆపని జరుగదు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. స్మశానానికి వెళ్ళేవరకు విధి నీ దేహాన్ని నడిపించుకుంటూ వెళ్ళిపోతుంది. ఈ లోపుగా కలగాపులగం చేసుకొని, లోకంతో తాదాత్మ్యం పొంది నీ మనస్సును పుండు చేసుకొని, నువ్వు చెడిపోవద్దు. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టి నువ్వు ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చెయ్యి. ముందు విషయం సరిగా అర్థం చేసుకో. నీ ఆలోచనలో స్పష్టత వచ్చేటప్పటికి, నీ బ్రెయిన్‌లో స్పష్టత వచ్చేటప్పటికి, నీకు సబ్జక్టు కొంత అర్థమవుతూ ఉంటేనే లోపల నుండి కొంత ఆనందం నీకు అందుతూ ఉంటుంది, వస్తువు అనుభవంలోనికి వస్తే వేరే చెప్పనక్కర లేదు. నీకు భక్తి వస్తే ముక్తి వచ్చేసినట్లే అన్నారు భగవాన్. జేబులో డబ్బు ఉండాలి కాని రైలు టికెట్ ఎంత సేపు కొనుక్కొంటాము, రైలులో కూర్చొన్నాక ఒక గంట ముందో, వెనుకో గమ్యానికి తీసుకొనిపోతుంది. ఆచార్యులువారు శివుడితో నువ్వు మెడలో పాములు వేసుకొన్నావు ఇంక నిన్ను ఆభరణాలు ఏమి అడుగుతాను, చర్మం కట్టుకొని తిరుగుతున్నావు ఇంక బాహ్యంగా

నిన్ను ఏమి అడుగుతాను, నీ పాదాలయందు భక్తిని ప్రసాదించు అన్నారు. భక్తి కలిగితే ముక్తి వచ్చేసినట్లే. భక్తి సంపాదించటం కష్టం. నిష్కామకర్మ కంటే ధ్యానం గొప్పది అని కొంతమంది చెపుతారు ఎందుచేతనంటే నిష్కామకర్మ చేస్తే ఎప్పుడో ఆ ఫలితం వస్తుంది. కాని నీవు ప్రోపర్‌గా ధ్యానం చేస్తూ ఉంటే, ధ్యానస్థితి నీకు కుదిరితే అప్పటికప్పుడు నీ మనస్సు చల్లబడుతుంది. మానసికఅనుబంధం పెట్టుకొంటే మనస్సులో ఉన్న దోషాలు నశిస్తాయి. మనం పైకి ఆడంబరంగా ఉండాలి అనుకొంటాము అనుకోండి అంటే లోపల శాంతి లేదు అని అర్థం. అందరిచేత గౌరవింపబడాలి అని అనుకొంటాము అనుకోండి లోపల శాంతి లేదు అని అర్థం. మన లోపల ఉన్న అశాంతే బయట గౌరవాల కోసం ఇలా ఏడుస్తూ ఉంటుంది. మనస్సు నిజంగా అణిగిపోతే పరిసరాలతో ఎంతో సన్నిహితమైన సంబంధం వస్తుంది, ఈ సృష్టిని కౌగిలించుకోవాలి అనిపిస్తుంది, మనస్సు నశించినప్పుడు ఈ సృష్టి మీద నీకు ప్రేమ కలుగుతుంది. లోపల ఉన్న శాంతి అనుభవంలోనికి వచ్చినప్పుడు వాడు ఇతరులను ఉద్ధరించాలని అనుకోడు, వాడు శరీరం ధరించి ఉంటే చాలు ఆ శరీరం ద్వారా లోకోద్ధరణ జరుగుతూ ఉంటుంది. భగవాన్ ఒక మాట చెప్పారు నాలో కనుక అజ్ఞానం ఉంటే మీకు చెప్పటానికి నా దగ్గర ఏమీ లేదు, నేనే కనుక జ్ఞానిని అయితే నాకు చెప్పటానికి ఇతరులు లేరు. మనం కుడిచేతిలో ఉన్న వస్తువును ఎడమచేతిలో పెట్టుకొని ఎవరినో ఉద్ధరించాము అని అనుకోము ఎందుచేతనంటే రెండు చేతులు మనవే. జ్ఞాని యొక్క వైభవం కూడా అటువంటిదే, అంతా తానే.

ఇతరులకు నువ్వు చేసే సహాయ సహకారములు అంతా తిరిగి నీకే వచ్చేస్తుంది అని భగవాన్ చెప్పారు. నువ్వు ఏమనుకొంటు న్నావు వారికి ఉపకారం చేస్తున్నాను అనుకొంటున్నావు, వారికి ఉపకారం చేయటం లేదు, నీకు నువ్వే ఉపకారం చేసుకొంటున్నావు, ఆ విషయం నీకు తెలియక వారికి ఉపకారం చేస్తున్నాను అనుకొంటున్నావు. దేహం ఏదో రోజు చనిపోతుంది. జీవితానికి, చావుకీ బేధం లేనిస్థితి ఒకటి ఉంది, ఈ దేహానికి మరణం వచ్చే లోపు ఆస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి, అదే సాధన యొక్క గమ్యం అని గాంధీ చెప్పారు. ఇంక మనం చేసేపని అంటావా మన దేహం ద్వారా ఏ పని జరగవలసి ఉంటే అది జరుగుతుంది. ఎవరో ఇతరుల గొడవ ఎందుకు, మేము ఇప్పుడు ప్రసంగాలు చెపుతున్నాము, ఇవి ఇష్టంతో చెప్పటం లేదు, మౌనంగా ఉండటం ఉత్తమం అనిపిస్తుంది, కాని చెపుతున్నాము. ఒకవేళ ఇవన్నీ మానేసి ఇంటి దగ్గర కూర్చొంటాము అనుకోండి ఇంటికి వచ్చేస్తున్నారు కదా, అప్పుడు ఇంటి దగ్గర చెప్పవలసి వస్తోంది. నేను ఇష్టంతో చెపుతున్నాను అని చెప్పలేను కాని అది ఆ దేహప్రారబ్ధం, ఆ దేహం అందుకు నియమింపబడింది,

చెప్పకొంటూ వెళ్లవలసిందే. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా మన దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది జరిగిపోతూ ఉంటుంది. నువ్వు చేసేది ప్రేమగా చెయ్యి, ఇష్టంగా చెయ్యి. నీకు పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు, అజ్ఞానం నశిస్తుంది, నీకు జ్ఞానోదయం కలగటానికి ఆ పని నీకు సహకరిస్తుంది.

నువ్వు జపం చేసి, ధ్యానం చేసి ఎంత కష్టపడినా కాని నీ మనస్సు అదుపులోనికి రాకపోతే మహాత్ముల సమక్షంలో నీ మనస్సు నిశ్చలమవుతుంది, నిర్మలమవుతుంది, నీ మనస్సు అణుగుతుంది, నీకు సమాధిస్థితి కలుగుతుంది. భగవంతుడిని విశ్వసించి, ఆయనను నిరంతరం స్మరించటం వలన మనకు అన్నీ ఇచ్చి మోక్షం కూడా ఇస్తాడు. విశ్వాసహీనుడికి ఇహం లేదు, పరం లేదు. బలహీనతలలో నుండి విడుదలపొందటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే గురువు నీకు సహాయం చేసి నీకు నొప్పి తెలియకుండా వాటిలో నుండి నిన్ను విడదల చేస్తాడు. నువ్వు పొందవలసింది పొందిన తరువాత దానికి మించినది కాని, దానితో సమానమైనది కాని ఏదీ లేదు అని నీకు అనుభవంలోనికి వస్తుంది. భగవాన్ చెపుతూ ఉండేవారు అనేక మంది వచ్చి మంత్రాల గురించి, పూజల గురించి, మహిమల గురించి, సాధనల గురించి ఇంకా ఎన్నో చెపుతున్నారు, దేని మీద నాకు ఆకర్షణ కలుగలేదు అని చెప్పారు. పొందవలసింది ఏదో అప్పటికే పొంది ఉన్నాడు ఇంక ఆకర్షణ ఏమి ఉంటుం ది. మీకు ఏదైనా తెలియని విషయంలో ఎవరైనా మిమ్మల్ని మోసం చేయగలరు కానీ మీకు తెలిసిన విషయంలో మిమ్మల్ని ఎవరూ మోసం చేయలేరు. మాకు అన్నీ ఉన్నాయి కానీ సుఖం లేదు అని కొంతమంది అంటారు. అన్నీ ఉంటే సుఖం ఎక్కడ నుండి వస్తుంది? సుఖం ఎక్కడ ఉందో ఆ వస్తువు మీకు తెలియాలి కదా. మీకు డబ్బు ఉంది అనుకోండి, శరీరానికి కంఫర్టు తీసుకొని వస్తుంది కానీ మనస్సుకు నిగ్రహం తీసుకొని రాలేదు. నీకు ఉన్న సంతానం వలన కాని, ధనం వలన కాని, చదువు వలన కాని, అధికారం వలన కాని నీకు మోక్షం రాదు అని వేదంలో చెప్పారు. మీ తల్లిదండ్రులు మంచివారు అనుకోండి పది రూపాయలు ఇస్తారు, బట్టలు ఇస్తారు అంతేగాని జ్ఞానాన్ని ఇవ్వలేరు, వారి దగ్గర ఉంటే కదా ఇవ్వటానికి. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో, ఎప్పడూ ఏ వస్తువు అయితే ఉందో దానిని పొందటం లాభమా, ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే వస్తువులను పొందటం లాభమా అది మీరు ఆలోచించుకోండి, మిమ్మల్ని బలవంతం చేయటం లేదు. గాఢనిద్రలో మీకు దేహాభిమానం లేదు, అప్పడు మిమ్మల్ని ఎవరైనా పొగిడినా సంతోషించరు, విమర్శించినా దుఃఖపడరు. జాగ్రదవస్థలో అలా ఉండటం నేర్చుకోండి, ఈ మాటే మీకు గురువు, దీనిని అభ్యాసం చేయండి. భగవంతుడు మనకు ఇచ్చిన అమూల్యమైన జీవితాన్ని జ్ఞానం

పొందటానికి ఉపయోగించకుండా చిల్లర విషయాలకు ఖర్చుపెడుతున్నాము. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను చూసి అవినయం తెచ్చుకోవద్దు. భగవంతుడు ఇచ్చిన అవకాశములను చూసి అవినయం తెచ్చుకోవద్దు. భగవంతుడు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటూ, ఆత్మజ్ఞాన సముపార్జనకు వాటిని ఉపయోగించుకోవాలి. కొంతమంది చిన్న పనిచేస్తారు, వారికి గొప్ప లాభం వస్తుంది. ఏమిటి ఈ మాత్రం దానికే అంత లాభం వచ్చింది? వారు ధనవంతులు అయిపోయారు అనుకొంటాము, అలా కంగారు పడకండి. పూర్వజన్మలకు దీనికి సంబంధం ఉంటుంది. మీకు సడన్‌గా ఏదయినా లాభం వచ్చినా, సడన్‌గా నష్టం వచ్చినా దీనికి పూర్వజన్మలకు ఏదో సంబంధం ఉంటుంది అని శాస్త్రంలో చెప్పారు. అది అర్థంకాక కంగారుపడతాము. మన ఇంట్లో నలుగురు ఉన్నారు అనుకోండి, అందరూ ఒకే రోజున చనిపోరు, మనం ఉండగా వారు అయినా పోతారు లేకపోతే వారు ఉండగా మనమైనా చనిపోతాము. అంటే ఆ కుటుంబంతో ఎంతవరకు అనుబంధం ఉంటే అంతవరకే. పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే చనిపోయిన వారి గురించి దుఃఖపడకండి, బతికి ఉన్నవారు ఎప్పుడు పోతారు అని కనిపెట్టుకొని ఉండవద్దు అని చెప్పాడు. ఈ రెండూ నేర్చుకోండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-02-05, మురమళ్ళ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మురమళ్ళ గ్రామంలో ఉన్న భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి వారి ఆలయం చాలా పురాతనమైనది. పూర్వం ఇక్కడ ఎందరో మునులు జపతపాదులు చేసినారు. మనం ఎంత సాధన చేసినా ఈశ్వరుని దయ ఉండాలి, ఆత్మజ్ఞాన సముపార్జనకు ఈశ్వరుని దయ అవసరం, ఆయన దయకు పాత్రులం అవ్వకుండా మన వలన ఏమీ సాధ్యం కాదు. ఎవడి కయితే రాగ ద్వేషములు లేవో, ఎవడయితే స్తోత్రాలకు పొంగకుండా విమర్శలకు కుంగకుండా ఉంటున్నాడో, ఎవడయితే భావోద్రేకం లేకుండా అన్నింటిని సహిస్తున్నాడో వాడిని బంగారం లాంటి మనస్సు కలవాడు అంటారు. ఆ బంగారంటాంటి మనస్సును సాధించాలంటే ఈశ్వరుని పాదాలను ఆశ్రయించాలి. మనం పూర్వజన్మలలో చేతితోగాని, మాటలతోగాని, ఆలోచనతో గాని ఏవైనా పొరపాట్లు చేసిఉంటే ఈజన్మలో రెండు రకాలుగా పీడించబడతాము. ఒకటి శరీరానికి రోగం వస్తుంది, రెండవది మనస్సుకు శోఖం వస్తుంది. ఈ రెండింటిలో నుండి విడుదల పొందాలంటే ఈశ్వరునిదయ ఉండాలి, గురువు అనుగ్రహం ఉండాలి. మనం రోజూ కొద్దిసేపు ఏకాంతంగా ఉండి భగవంతుడిని స్మరించుకోవాలి, జరిగిపోయిన గొడవలు